క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా నవరాత్ర ఉత్సవాలు



నవరాత్ర ఉత్సవాల సందర్భంగా సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో కొలువైన సాయిబాబా ఆలయం 68వ వార్షికోత్సవం సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా భజనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ముగింపు సందర్భంగా సాయిబాబా విగ్రహానికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తుల విరాళాలతో భారీ అన్నదానం నిర్వహించారు. పామర్రు, పాణింగపల్లి, నరజాడ, కూళ్ల తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నవరాత్ర ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న పర్యవేక్షకులు చంద్రకళ, శారద తదితరులు

కె.గంగవరం: ప్రస్తుత సమాజంలో బాలబాలికలు బాల్య వివాహాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ పర్యావేక్షకులు చంద్రకళ, శారద సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో శనివారం బాలబాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. వారు పిల్లలకు బాల్య వివాహాలు, రక్తహీనత, పోషకాహారం తీసుకోవడం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు భీమరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దైవానుగ్రహంతో సత్ప్రవర్తన

కపిలేశ్వరపురం: దైవానుగ్రహంతో మనిషికి సత్ప్రవర్తన అలవడుతుందని ప్రముఖ ఖర్చక గురువులు పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు అన్నారు. మండల పరిధి అంగరలోని రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ ఆచారం ప్రకారం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద వెంకట లక్ష్మీనరసింహాచార్యులతో చోర సంవాద కథా శ్రవణం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తా అబ్బు తదితర సభ్యులు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు దుస్తుల పంపిణీ



ఆటోడ్రైవర్లకు దుస్తులు అందజేస్తున్న విజయభాస్కరరెడ్డి, అన్నపూర్ణ దంపతులు

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా శనివారం గ్రామంలోని 50 మంది ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన సతీమణి, సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణతో కలిసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, మండ నాగిరెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రాయవరం: ఎరువులు, ఫెర్టిలైజర్స్ డీలర్స్ ఎరువులు పురుగు మందుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. రాయవరంలో శనివారం ఎరువులు, పురుగు మందుల డీలర్లతో వ్యవసాయ అధికారి సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలను పాటించాలని సూచించారు. ఎరువుల షాపుల దగ్గర ఎటువంటి రాజకీయ పార్టీల ఫొటోలు, గుర్తులు ఉంచరాదని అన్నారు. ఎరువుల బస్తాలపై రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలు, గుర్తులు కలిగి ఉంటే వాటిపై మాస్క్ వేసి విక్రయించాలన్నారు. ఎరువులు వ్యాపారులందరూ క్రయవిక్రయాలకు ఎటువంటి నిబంధన లేదని ఎన్నికల నియమావళిని పాటిస్తూ అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాబలంతోనే సంక్షేమ పాలన సాధ్యం

- మరోసారి వైఎస్సార్ సీపీ విజయం తథ్యం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



వల్లూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గత ఎన్నికల్లో ప్రజలిచ్చిన బలంతోనే ఐదేళ్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సాధ్యపడిందని, ప్రజల ఆదరణతో రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి విజయం తథ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వల్లూరులో శనివారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవిందు, జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చల్లా ప్రభాకర్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలంలతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామ ఎంపీటీసీ పెందుర్తి శిరీష, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల సతీష్, పార్టీ నాయకులు చేంబ్రోలు వీరభద్రరావు, రుద్రయ్య చౌదరి, పుట్టా సత్యనారాయణ, తదితరులు ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ తోటతోపాటు స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పథకాల ద్వారా అందిన ప్రయోజనాలను లబ్ధిదారులు ఎమ్మెల్సీ తోటతో పంచుకున్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేసినందుకు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి అందిందన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని తర్వాత ఐదేళ్లు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలన్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానమన్నారు. ఆ విధంగా సాగిన పాలన ఫలితంగా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందగలిగారన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీను, సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్, మండల పరిషత్ విప్ పలివెల మధు, నాయకులు జిన్నూరి సాయిబాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

- మేలు జరిగితేనే ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



స్టీల్‌విల్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నేరుగా పేదలకు సంక్షేమ పథకాలు అందాయని, మీకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని ధైర్యంగా చెబుతున్న దమ్మున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ పథకాలు తిరిగి ఇదే విధంగా ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 2వ వార్డు స్టీల్ విల్ పేటలో కొత్తూరు రోడ్డు, పాతపేట వద్ద నుంచి 'గడపగడపకు ప్రచార కార్యక్రమం'లో సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక కొత్తూరు రోడ్‌లో కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులు సూర్యప్రకాష్‌కు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతును ఇవ్వాలని కోరారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన ఉదయం 6 గంటలకే ప్రతి అవ్వకు, ప్రతి తాతకు ఇంటి వద్దనే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం దేశంలోనే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని ఆయన అన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన కోరారు. సూర్యప్రకాష్ సమక్షంలో రామచంద్రపురం మండలం వెలంపాలెంకు చెందిన టీడీపీ నేత చెట్లర్ కర్ణ ఆధ్వర్యంలో పలువురు నేతలు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాను వేసి సూర్యప్రకాష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, వార్డు నాయకులు బొమ్మ మోహన్‌రావు, దొమ్మలపాటి శ్యామ్, ఉండ్రాజవరపు దొరబాబు, ములపర్తి ప్రభాకర్, ఉప్పలపాటి నెపోలియన్, దొమ్మలపాటి లాలి ప్రసాద్, నీల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుశిక్షితులైన సైనికుల్లా పని చేయాలి



బూత్ స్థాయి కమిటీలతో శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి

రాయవరం: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ లెవెల్ కమిటీ సభ్యులు సుశిక్షితులైన సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీ సభ్యులకు పార్టీ తరపున కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ స్థాయి కమిటీలు కీలకపాత్ర పోషించాలన్నారు. మండల బూత్ లెవెల్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి కమిటీలు క్రమశిక్షణతో పని చేయడం ద్వారా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పాలిక శ్రీను, పాలిక గోవిందు, పిల్లి సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీరాములు, కోటి అంబేద్కర్, డీఆర్సీ రెడ్డి పాల్గొన్నారు.

దొమ్మేటి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



వెంకటాయపాలెంలో వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు



మహిళలు, వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న బీసీ నాయకులు

కాజులూరు: శెట్టిబలిజ సంఘం నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను బీసీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకుని దుగ్గుదుర్రులో ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటి కాలంలోనే కోనసీమ నుంచి బర్మాలోని రంగూన్‌కు వ్యాపారాలకు వెళ్లి అక్కడ మేయర్ పదవి చేపట్టిన వెంకటరెడ్డి కోనసీమ శెట్టిబలిజల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో..

రామచంద్రపురం రూరల్: శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి మండలంలోని వెంకటాయపాలెంలో శనివారం బీసీ సంఘం గౌరవాధ్యక్షుడు రాయుడు చంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. చంద్రరావు మాట్లాడుతూ సమాజంలో శెట్టిబలిజలకు గౌరవంగా పెరిగే విధంగా వెంకటరెడ్డి వారి చదువులకు బాటలు వేశారన్నారు. పాఠశాలలు స్థాపించి చదువులను ప్రోత్సహించారన్నారు. విద్యా దాతగా, బర్మా కేసరి అవార్డు గ్రహీతగా దొమ్మేటి సేవలను కొనియాడారు. అనంతరం మహిళలు, వృద్ధులకు రాయుడు భాస్కరరావు దాతృత్వంతో నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుబ్బల బాలగోపాల్, చింతా కుల ప్రకాశ్, వాసంశెట్టి వీరగోపాల్, కాలా నరసింహమూర్తి, కడలి రాంపండు, డాక్టర్ అనుసూరి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి



మండపేటలో ఓటు ప్రాధాన్యత ప్రచార కార్యక్రమంలో కమిషనర్, సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ బి.రాము, ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండపేటలో శనివారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఐసీడీఎస్ ద్వారా ఓటు ప్రాధాన్యతపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యతను తెలిపే ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోంది



దుగ్గుదుర్రులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

కాజులూరు: గతంలో రౌడీలను వెనుక ఉంచుకుని పలువురు రాజకీయాలు చేసేవారని ప్రస్తుతం టీడీపీ రౌడీలనే రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తుందని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. దుగ్గుదుర్రులో స్థానిక మాజీ ఎంపీటీసీ దంగేటి పద్మ, దంగేటి అరుణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం పలు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. సభలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఎందరో నాయకులు ఎమ్మెల్యేలుగా గెలుపొంది అల్లర్లకు తావులేకుండా పరిపాలన చేశారని అయితే టీడీపీ ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న స్థానికేతర అభ్యర్థికి అవకాశం ఇచ్చి నియోజకవర్గ ప్రశాంతతకు భంగం కలిగిస్తుందన్నారు. ప్రజలు పార్టీల పనితీరుతో పాటు అభ్యర్థుల గుణగణాలను పరిగణలోకి తీసుకుని ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత బారతి, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ రేమళ్ళ చిట్టియదొర, పార్టీ నాయకులు పోతు శ్రీనివాస్, శెట్టిపల్లి కృష్ణారావు(బాబు), మండల గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రచార కార్యక్రమం



నేలటూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని ఆ పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని నేలటూరు, వల్లూరు గ్రామాల్లో శనివారం రాత్రి కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ మండల కన్వీనర్ శీలం గోవిందు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యులు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, పెందుర్తి శిరీష, గ్రామ పార్టీల అధ్యక్షుడు శనక్కాయల దొరబాబు, చేంబ్రోలు వీరభద్రరావు, నాయకులు ముత్యాల సతీష్, రుద్రయ్య చౌదరి, రుద్రాక్షుల శ్రీనివాస్, కొప్పిశెట్టి కిశోర్, చల్లా చిన్నబాబుల, పాలింగి శ్రీనివాస్ సమక్షంలో ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రజల ముందుకు వెళ్లాలని సూచించారు.

నూతన డిజైన్లపై దృష్టి సారించాలి

ఆప్కో ఎండీ పావనమూర్తి



అంగర చేనేత సహకార సంఘంలో చీర నాణ్యతను పరిశీలిస్తున్న ఆప్కో ఎండీ పావనమూర్తి

కపిలేశ్వరపురం: మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితు దృష్ట్యా ఆధునిక తీరుతెన్నులపై చేనేత కార్మికులు అవగాహన పెంచుకోవాలని, అందుకు అనుగుణంగా నూతన డిజైన్లపై దృష్టి సారించాలని ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ బి.పావనమూర్తి అన్నారు. మండల పరిధి అంగరలోని శ్రీగణపతి చేనేత సహకార సంఘాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆయనకు సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఎం.రాజు, మేనేజర్ కొలువుల సుబ్బారావు, డైరెక్టర్లు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కార్మికులతో మమేకమయ్యారు. నూతన డిజైన్లతో వస్త్రాల తయారీ, సమయ పాలన, విక్రయాలు తదితర అంశాలపై కార్మికులతో మాట్లాడారు. కార్మికులు ప్రస్తావించిన సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కరోనా కాలంలో వస్త్రాల తయారీ, విక్రయాలు నిలిచిపోవడంతో సహకార సంఘం వ్యాపార అవకాశాలు సన్నగిల్లాయని పాలకవర్గ సభ్యులు ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఎండీ పావన్‌మూర్తి మాట్లాడుతూ మారుతున్న ప్రజల అభిలాషలకు అనుగుణంగా వస్త్రాలను తయారు చేయాలన్నారు. ఆన్‌లైన్ వస్త్ర వ్యాపార తీరుతెన్నులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మురమండ, పులగుర్త, హసనబాద, అద్దంపల్లి చేనేత సంఘాలను సందర్శించినట్టు తెలిపారు. సమావేశంలో ఆప్కో టీఏ శ్రీకాంత్, నల్లూరు, నేలటూరు, మండపేట సహకార సంఘాల మేనేజరు పి.బసవన్న, సీహెచ్ కుమార స్వామి, వి.గణపతి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిపై విస్తృత ప్రచారం



మారేడుబాకలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ పిల్లా వీరబాబు

కపిలేశ్వరపురం (మండపేట): కార్యకర్తల సమన్వయంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, సీనియర్ నాయకులు కురుపూడి రాంబాబు, పోతుల దుర్గాప్రసాద్ అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో శనివారం సర్పంచ్ మట్టపర్తి గోవింద రాజు, ఉప సర్పంచ్ టేకి దుర్గారావు తదితర నాయకులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లంగి రాజశేఖర్, పులగం శ్రీనివాస్, కొండపల్లి రాజేంద్ర ప్రసాద్ గండి రాజ్‌కుమార్, అల్లక రాము, ఎం.నాగేంద్ర, ముల్లేటి వెంకటరమణ పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి

కాజులూరు: రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని గొల్లపాలెం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. శనివారం గ్రామంలో వీఏఏ వి.రమ్య అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, పంటల బీమా, ఈ-పంట నమోదు, వైఎస్సార్ పొలంబడి, వ్యవసాయ యాంత్రీకరణ(సీహెచ్‌సీ) తదితర పథకాల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆలమూరు: గ్రామంలోని ఏటిగట్టు రోడ్డులో ఓదులపల్లి రమేష్‌బాబు (45) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం అనంతపురం జిల్లా వేములవారిపల్లికు చెందిన రమేష్‌బాబు గత కొంత కాలంగా గ్రామంలో నివసిస్తున్న సోదరుడు రామకృష్ణ వద్ద నివాసం ఉంటున్నాడు. అతడికి తల్లిదండ్రులు లేకపోవడంతో సోదరుడు రామకృష్ణ తన తమ్ముడి బాధ్యతలు చూసుకుంటున్నాడు. అయితే ఇటీవల చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈనెల 19న సోదరుడు రామకృష్ణ వద్దకు వచ్చి కొంత సొమ్ము కావాలని అడిగి తీసుకువెళ్లాడు. అప్పటి నుంచి మృతుడు రమేష్ కనపడకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా గాలించారు. స్థానిక కాలిబాట వంతెన సమీపంలోని ఏటిగట్టు పక్కన ఉన్న మామిడిచెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా మారాడు. స్థానికుల ఇచ్చిన సమాచారంతో ఎస్సై శ్రీను నాయక్ కేసును నమోదు చేయగా రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.